క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ బూత్ ఇన్‌చార్జ్



పార్టీలో చేరిన గోవిందన్, శివగామి దంపతులు

కుప్పం రూరల్: కుప్పం మండలం, టి. సదుమూరుకు చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ గోవిందన్, శివగామి దంపతులు మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు శీను, పళని ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గోవిందన్ దంపతులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష చూపకుండా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చూసి పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. ప్రతి నెలా ఠంచనుగా 1వ తేదీ ఉదయాన్నే పింఛను ఇవ్వడం విశేషమని, గతంలో ఏ ప్రభుత్వ పాలనలోనూ ఇలా తాము చూడలేదన్నారు.

26 నుంచి 'సప్తగిరి' బ్యాంకు కార్మికుల సమ్మె

కుప్పం రూరల్: సప్తగిరి గ్రామీణ బ్యాంకుల్లో దినసరి వేతనానికి పని చేస్తున్న క్యాజువల్ కార్మికులు ఈ నెల 26 నుంచి సమ్మెకు పూనుకుంటున్నట్టు ఆ సంఘం అధ్యక్షులు శివరాం బాబు, ప్రధాన కార్యదర్శి రాజేష్, శ్రీనివాసులు చెప్పారు. కుప్పంలో విలేకరులతో వారు మాట్లాడారు. 26 నుంచి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 2న చిత్తూరులో నిరవధిక సమ్మె చేస్తామని చెప్పారు. రోజు వారీ వేతనం రూ.60కి పని చేస్తూ బ్యాంకు పురోగతికి కష్టపడ్డామని, ప్రస్తుతం తమను కాదని, అవుట్ సోర్సింగ్ కింద కార్మికులను నియమించేందుకు టెండర్లు పిలవడం దారుణమన్నారు. కోర్టులో కేసులు నడుస్తున్న సమయంలో టెండర్లను ఆహ్వానించడం సరికాదని ఆక్షేపించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

వైభవంగా వినాయకస్వామి ఊరేగింపు



బైరెడ్డిపల్లెలో ఊరేగుతున్న స్వామివారు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన వినాయకస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని మంగళవారం స్వామి వారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన పల్లకిపై స్వామి వారి విగ్రహాన్ని కొలువుదీర్చి మంగళవాయిద్యాల హోరు నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- ఆర్డీఓ మనోజ్‌రెడ్డి



లింగ వివక్ష నిర్మూలన కమిటీతో ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

పలమనేరు: ప్రైవేట్ ల్యాబ్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆర్డీఓ లింగ వివక్ష నిర్మూలన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలను చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డివిజన్‌లో ఎక్కడైనా స్కానింగ్ సెంటర్లలో ఇలాంటి పనులు చేస్తుంటే వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. హెల్త్ అధికారి మల్లికార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు విరిచేసిన మామిడి చెట్ల కొమ్మలు

సదుం: మండలంలోని నాయినివారిపల్లె అటవీ ప్రాంతంలోని పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించినట్లు రైతులు మంగళవారం ఉదయం గుర్తించారు. రాజేశ్వరమ్మ, మల్లికార్జునకు చెందిన వరి పంటను తొక్కివేశాయి. సుబ్బయ్యకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. వాసుదేవరెడ్డికి చెందిన ప్రహరీ గోడను ధ్వంసం చేశాయి.

బాలిక అదృశ్యం

గంగవరం: మైనర్ బాలిక అదృశ్యంపై గంగవరం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ చిన్నగోవింద్ కథనం.. మండలంలోని పత్తికొండకు చెందిన వెంకటరమణ కుమార్తె తేజశ్రీ గత ఏడాది పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఆమె కనిపించక పోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ మెజార్టీ సాధనే లక్ష్యం

- మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని వినతి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పని చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ ప్రచారంలో తుమ్మగుంటపల్లె వద్ద ఆయన పాల్గొన్నారు. విజయం మనదేనని.. గతంలో కంటే భారీ మెజారిటీ సాధించేలా కృషి చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రాజకీయాలు, పార్టీలకతీతంగా సంక్షేమ లబ్ధి చేకూరిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను నమ్మరాదని విజ్ఞప్తి చేశారు.

మోటార్ సైకిళ్ల ర్యాలీ

మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పాలమంద, 79–ఏ చింతమాకులపల్లె, ఊటుపల్లె, చింతలవారిపల్లె, కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, రెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెంలో ర్యాలీ కొనసాగింది. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, హరినాథరెడ్డి, సర్పంచులు మనోహర్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, రెడ్డెమ్మ, శ్రీనివాసులరెడ్డి, దీప, హనుమంతరెడ్డి, రేణుకమ్మ, ఎల్లప్ప, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సేవ ఉన్నతం..టీడీపీ తీరు నీచం



ఎన్‌వీజీ ఫౌండేషన్ పంపిణీ చేసిన రైటింగ్ ప్యాడ్లపై కేవలం వెంకటేగౌడ ఫొటో మాత్రమే ఉన్న దృశ్యం(ఫైల్)

- ఎన్‌వీజీ ఫౌండేషన్ పంపిణీ చేసిన రైటింగ్ ప్యాడ్లపై నానాయాగీ
- టీడీపీ నేతలపై మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పలమనేరు: పదో తరగతి విద్యార్థులు పబ్లిక పరీక్షల్లో మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా ఎన్‌వీజీ ఫౌండేషన్ రైటింగ్ ప్యాడ్లను అందజేస్తోంది. ఈ ఏడాది సైతం పలమనేరు నియోజకవర్గంలోని హైస్కూళ్లలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు దాదాపు 30వేల పైచిలుకు రైటింగ్ ప్యాడ్లను పంపిణీ చేసింది. ఆ ప్యాడ్లపై ఎమ్మెల్యే వెంకటేగౌడ చిత్రంతో 'ఉన్నత శిఖరాలే మీలక్ష్యం' ఎన్‌వీజీ ఫౌండేషన్ అని ప్యాడ్లపై చిన్న అక్షరాలతో ముద్రించి ఉంది. పదేళ్లుగా ఫౌండేషన్ ఈ సేవ చేస్తోంది. రైటింగ్ ప్యాడ్ల మీద ఎక్కడా వైఎస్సార్‌సీపీ అనిగానీ, ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలేవీ లేవు. ఇన్నేళ్లుగా పరీక్షల్లో చాలామంది వీటినే వాడారు. అయితే ఈ పర్యాయం ఆ ప్యాడ్లతో పబ్లిక్ పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు టీడీపీ నేతల తీరు మూలాన చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల నిబంధనలు పాటించడం లేదంటూ అధికారులకు ఫిర్యాదు చేసి హంగామా చేశారు. దీంతో కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఈ ప్యాడ్లను అనుమతించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఇక, పనికట్టుకుని పచ్చపత్రికలు కూడా కోడ్ ఉల్లంఘన అంటూ ఓవరాక్షన్ చేశాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మా పిలకాయలకు ఏమైనా ఓటు హక్కు ఉందా? ప్యాడ్లు ఇచ్చినారు కదా అని వాళ్లేమైనా ఓట్లేపిస్తారా?.. కొంచెమైనా బుద్ధీ జ్ఞానం ఉండాలి..మీరు ఇవ్వరు..ఎవరైనా ఇస్తే ఓర్చుకోలేరు..పదో తరగతి పరీక్షలు రాసే పిలకాయలను కూడా మీ దరిద్రపు రాజకీయాలతో ఇబ్బంది పెడతారా?'' అని టీడీపీ నేతలను శాపనార్థాలు పెట్టారు. ఇదలా ఉంచితే, టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు స్థానిక ఆర్డీఓ మనోజ్‌రెడ్డి పట్టణంలోని టెన్త్ పరీక్ష కేంద్రాలకు వెళ్లి తమ సిబ్బంది ద్వారా విద్యార్థుల నుంచి ఎన్‌వీజీ ప్యాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

గంగవరం: ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే వెంకటేగౌడ 65 వేల మెజార్టీ సాధించాలనే లక్ష్యంలో మండలం నుంచి 20వేల పైచిలుకు మెజార్టీ సాధించి పార్టీకి కానుకగా ఇవ్వాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, అలాగే ప్రతిపక్షాల కుట్రలను, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, సిద్ధప్ప, వినోద్‌రెడ్డి, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

సైనిక్ స్కూల్‌కు ముగ్గురి ఎంపిక



చరణ్



పృథ్వీరాజ్



మేఘనాథ్‌రెడ్డి

పలమనేరు: పట్టణానికి చెందిన ముగ్గురు పిల్లలు సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు. పట్టణంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన చరణ్, పృథ్వీరాజ్, మేఘనాథ్ రెడ్డి మంచి మార్కులు సాధించి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు.

'కోడ్' పక్కాగా అమలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలుకు నియమించిన అన్ని బృందాలు సకాలంలో స్పందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న అధికారులకు మంగళవారం సాయంత్రం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు నంబర్లను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు రిపోర్టులను అందజేయాలని, వెబ్ కాస్టింగ్ నెట్‌వర్క్‌లకు సంబంధించి ఏర్పాట్లను సరిచూసుకోవాలన్నారు. ఫిర్యాదులకు సంబంధించి రెండు గంటల్లో స్పందించి వాటిని పరిష్కరించి, నివేదికను పంపాలన్నారు. అలాగే సింగిల్ విండో విధానంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అరుణ, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



ఆలయ అధికారులకు విరాళం ఇస్తున్న బెంగళూరు వాసులు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు మంగళవారం విరాళాల రూపంలో రూ.2లక్షలు అందింది. బెంగుళూరుకు చెందిన చేతన్ రెడ్డి, రమణారెడ్డి చెరో రూ.లక్ష చొప్పున ఆలయ అధికారులకు అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లతో మెరుగైన విద్యుత్ సరఫరా

- లోఓల్టేజీ సమస్య పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజానీకం
- నియోజకవర్గంలో రూ.150కోట్లతో 48 సబ్‌స్టేషన్లు
- మారుమూల గ్రామాలకు సైతం అందుతున్న నాణ్యమైన విద్యుత్



పులిచెర్ల మండలం మిట్టమీద రాచపల్లె వద్ద ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్

పులిచెర్ల(కల్లూరు): పుంగనూరు నియోజకవర్గంలో విద్యుత్ సమస్య పూర్తిగా లేకుండా ఉండేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు మొత్తం రూ.150కోట్లతో కొత్తగా 48 సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయి. వీటి నిర్మాణం కూడా పూర్తి చేసి ప్రారంభోత్సవాలు సైతం చేశారు. నియోజకవర్గంలో ఎక్కడగానీ లోఓల్టేజీ, మారుమూల గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తరాదనే ఉద్దేశం నెరవేరింది. గత తెలుగుదేశం పార్టీ పాలనలో లో ఓల్టేజీ, విద్యుత్ సమస్యలు తరచూ తప్పేవి కాదు. దీంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడేవారు. వ్యవసాయరంగంలో మరీ ఇక్కట్లు తప్పేవికావు. కరెంటు సరఫరా ఎప్పుడు చేస్తారో? ఎప్పుడు పంటలకు నీళ్లు పారించాలోనని రైతులు వ్యవసాయ బోర్ల వద్ద రేయింబవళ్లు పడిగాపులు కాసిన ఉదంతాలు అనేకం. చివరకు ఏ అర్ధరాత్రి వేళకో కరెంటు వ్యవసాయానికి ఇచ్చేవాళ్లు. ఆ సమయంలో పొలాలకు వెళ్తూ పాము కాటుకు గురై మరణించిన రైతులూ లేకపోలేదు. మరోవైపు కరెంటు సక్రమంగా అందక పంటలు సైతం ఎండిపోయేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ సరఫరాలో ఇప్పుడా పరిస్థితి లేదు. ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో పరిష్కారం లభించింది.

మండలాల వారీగా ఏర్పాటు చేసిన కొత్త సబ్‌స్టేషన్లు

పుంగనూరు	:	23
పులిచెర్ల	:	6
రొంపిచెర్ల	:	4
సదుం	:	4
సోమల	:	2
చౌడేపల్లె	:	9

లో ఓల్టేజీ సమస్యే లేదు



కొత్త సబ్‌స్టేషన్లు పెట్టాక లోఓల్టేజీ సమస్య అనే మాటే లేదు. కరెంటు కూడా బాగా వస్తోంది. ఇక రైతులకు ఏ ఇబ్బందీ లేదు. ప్రజాప్రతినిధుల పుణ్యమా అని కరెంటు బాధలు తప్పాయి.

–జంపాల రాజేష్, రైతు, రేణుమాకులపల్లె

కరెంటు కోసం ఎదురుచూసే పరిస్థితి లేదబ్బా



కొత్త సబ్‌స్టేషన్లు పెట్టినాక అన్ని మండలాలలో 24 గంటలూ మారుమూల గ్రామాలకు కూడా కరెంటు బాగా వస్తాంది. ఇంతకు ముందు ప్రభుత్వంలో మాదిరి పరిస్థితి లేదు. అప్పుడైతే కరెంటెప్పుడొస్తాదా? అని పొలాల కాడ పడిగాపులు కాసేవాళ్లం.

–సి.వీరయ్య, రైతు, ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె

పులివెందులకు దీటుగా కుప్పం అభివృద్ధి



కరపత్ర ప్రచారం చేస్తున్న భరత్

- కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్
- వివక్ష చూపక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



మహిళకు అభివాదం చేస్తున్న భరత్

కుప్పం రూరల్: కుప్పంలో తనను గెలిపించి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే పులివెందులకు దీటుగా కుప్పాన్ని అభివృద్ధి చేసి చూపుతానని కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని రాజీవ్‌కాలనీలో ఆయన జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తో కలిసి ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఇన్నేళ్లూ మోసపూరిత హామీలు, పేపర్లపై అభివృద్ధి చూపి జనాన్ని మోసం చేశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతిపక్ష నాయకుని నియోజక వర్గమని వివక్ష చూపక పలు అభివృద్ధి పనులు చేశారని వాటి గురించి వివరించారు. అందరికీ అందుబాటులో ఉన్నదెవరో, తెలంగాణలో ఉంటూ ఊసరవెల్లి రాజకీయాలు నెరపుతున్నదెవరో ప్రజలు గుర్తెరిగి ఓటును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలోచించి జగనన్న ప్రభుత్వంలో మేలు జరిగింటే తమకు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగరాజు, కుమ్మరేష్, రత్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురూ రామచంద్రులే!

- ఆసక్తి రేపుతున్న పుంగనూరు ఎన్నికల బరి
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ
- రొంపిచెర్లలో అడుగు పెట్టని యాదవ్
- ఒంటరిగా చల్లా రామచంద్రారెడ్డి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చల్లా రామచంద్రారెడ్డి



రామచంద్ర యాదవ్

రొంపిచెర్ల: సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా మూడు పార్టీల నుంచి ముగ్గురు రామచంద్రులే పోటీ చేస్తున్నారు! వైఎస్సార్‌సీపీ తరఫున పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ నుంచి చల్లా రామచంద్రారెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ఎన్నికల బరిలో ఉన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పదవసారి ఎన్నికలలో పోటీ చేస్తుండగా, చల్లా రామచంద్రారెడ్డి, రామచంద్ర యాదవ్ పోటీ చేయడం ఇది రెండోసారి. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టి, పార్టీశ్రేణుల్లో ఉత్సాహం నింపారు. దీంతో నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సింగిల్‌విండో అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రచారం జోరుగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రచారంలో దూసుకుపోతుండగా, టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఒక్కరే ప్రచారం చేస్తున్నారు. ఆయనది సొంత మండలం రొంపిచెర్ల కావడంతో ఆ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్ని గ్రామాలలో బైక్ ర్యాలీలతో ప్రచారం చేశారు. ఇక రామచంద్ర యాదవ్ ఇప్పటివరకు మండలంలో అడుగు పెట్టలేదు. గానుగచింత గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఇంటింటా ప్రచారానికి పూనుకుంటోంది.

ఈ పచ్చ ప్రచారాన్ని ఏమంటారు?



గుడిపాల వద్ద దర్శనమిస్తున్న టీడీపీ ప్రచార గోడ

గుడిపాల: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నాలుగురోజులు గడుస్తున్నా మండలంలో తెలుగుదేశం పార్టీ ప్రచార రాతలు ఇంకా దర్శమనిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డులను స్వచ్ఛందంగా పెట్టుకున్నా టీడీపీ నాయకులు నానా హంగామా చేసి అధికారులకు ఫిర్యాదు చేసి తీయించారు. అయితే తుమ్మలవారిపల్లె, గుడిపాల, పానాటూరు ప్రాంతాల్లో గోడలకు పసుపు రంగు వేయించి రాయించిన టీడీపీ ప్రచార రాతలు మాత్రం అలాగే ఉంచేశారు. దీనిపై జనం మండిపడుతున్నారు. అధికారులకు ఇవి కనిపించవా? అని ప్రశ్నిస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

బంగారుపాళెం: గంజాయి విక్రేతను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ లక్షుమయ్య తెలిపారు. ఆయన కథనం..బంగారుపాళెం పోస్టాఫీసు వీధిలో నివాసముంటున్న అంజాద్‌ఖాన్(39) దళితవాడ సమీపంలో వినాయకుని గుడి వద్ద గంజాయితో ఉండగా తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో బంగారుపాళెం సీఐ, సిబ్బంది పట్టుకున్నారు. అతని నుంచి రూ.12వేల విలువైన 2కిలోల 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.

నవరత్నాలతో పార్టీలకతీతంగా లబ్ధి



పుంగనూరులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ జయభారతి, జయకృష్ణ

- వైఎస్సార్ సీపీని గెలిపించాలని జోరుగా నాయకుల ప్రచారం

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే పేద ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం నవరత్నాల పేరిట అమలు చేసిన పథకాలతో అర్హత కలిగిన కుటుంబాలన్నీ పార్టీకతీతంగా లబ్ధి పొందాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా విజ్ఞప్తి చేశారు. మంగళవారం పట్టణంలోని కొత్తపేట, చౌడేపల్లె రోడ్డు ప్రాంతాలలో ఇంటింటా ఆయన కరపత్ర ప్రచారం చేశారు. అలాగే భగత్‌సింగ్‌కాలనీలో కౌన్సిలర్ జయభారతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జయకృష్ణ, హిదాయత్‌నగర్, మంగళం కాలనీలో కౌన్సిలర్ నరసింహులు, నానబాల వీధిలో కౌన్సిలర్ నయింతాజ్, మైనారిటీ సెల్ కార్యదర్శి ఇంతియాజ్‌ఖాన్, కొత్తపేటలో కౌన్సిలర్ మమత, పార్టీ నాయకుడు లక్ష్మణరాజు, ధోబీకాలనీలో కౌన్సిలర్ ఆదిలక్ష్మి, నాయకులు శ్రీనివాసులు, మురుగేష్ , కుమ్మరవీధిలో కౌన్సిలర్ రేష్మా, నాయకులు అస్లాంమురాది, నయాజ్, రహమత్‌నగర్‌లో కౌన్సిలర్ సాజిదాబేగం, మైనారిటీల నాయకుడు మహబూబ్‌బాషా, ఏటిగడ్డపాళ్యంలో బలిజ సంఘ పట్టణ నాయకురాలు కొండవీటి మాధురి, కొండవీటి నరేష్ కరపత్ర ప్రచారం చేశారు.



పుంగనూరు హిదాయత్‌నగర్‌లో..



పుంగనూరు నానబాలవీధిలో..